తెలంగాణకు వర్ష సూచన.. 18 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ 2

Neti Velugu
నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
RNI NO. TELTEL/2023/88559
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com



## రిపోర్టర్లు కావలెను

నేటి వెలుగు తెలుగు దినపత్రిక లో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను

తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో మరియు మండల హెడ్ క్వార్టర్స్ లో రిపోర్టర్లు కావాలి

ఆసక్తి గలవారు ఈ నెంబర్కు సంప్రదించండి:- సంపాదకులు పామనగుండ్ల నవీన్ కుమార్ గౌడ్ 9553276552.



నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 63 | జూన్ 4 గురువారం 2026 | పేజీలు : 4 | వెల రూ. 4.00/-





# ఆరోగ్యమే అసలైన సంపద.. జీవనశైలి మార్చుకోవాలి: సీఎం చంద్రబాబు

గుంటూరులో లలితా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించిన సీఎం చంద్రబాబు

సంజీవని ప్రాజెక్టు, యూనివర్సల్ హెల్త్ పాలసీ వివరాలు వెల్లడి

గత ప్రభుత్వంలో నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతిన్నదని విమర్శ

ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ప్రజలకు సూచన




# కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం.. హాజరైన రాహుల్, ఖర్గే

ప్రమాణం చేయించిన గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్

కేబినెట్లో సిద్ధరామయ్య తనయుడికి చోటు

ప్రమాణానికి ముందు డీకేకు ఫోన్ చేసిన సోనియా గాంధీ

అందరినీ కలుపుకుని పనిచేస్తానని సోనియాకు హామీ ఇచ్చిన డీకే



# తెలంగాణ నాలుగు కోట్ల మంది జాగీర్: కేటీఆర్



పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్

తెలంగాణ ఇక్కడి భూమిపుత్రుల జాగీరని వ్యాఖ్య

పవన్ ఎక్కడైనా పోటీ చేసుకోవచ్చన్న కేటీఆర్

కానీ, సెక్రటేరియట్‌లో పెత్తనం చేస్తామంటే ఊరుకునేది లేదన్నారు.

తెలంగాణ ఇక్కడున్న నాలుగు కోట్ల మంది భూమి పుత్రుల జాగీరని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అయితే, ఇక్కడికి ఎవరైనా రావొచ్చని స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణకు వస్తే అడ్డుకుంటామని ఎవరూ చెప్పలేదని పేర్కొన్నారు. అయితే తెలంగాణ ఆవిర్భావం రోజు హైదరాబాద్‌లో

# నెహ్రూ రికార్డు బద్దలు.. సుదీర్ఘకాలం పాలించిన ప్రధానిగా మోదీ సరికొత్త చరిత్ర!


జూన్ 10 నాటికి ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకోనున్న మోదీ

4,398 రోజుల పాటు పాలించిన నేతగా ఇప్పటి వరకు నెహ్రూ పేరిట రికార్డు

4,077 రోజులు అధికారంలో ఉన్న ఇందిరా గాంధీ

అత్యధిక కాలం అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధిగా ఇప్పటికే మోదీ పేరిట రికార్డు

భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో అరుదైన మైలురాయిని అందుకోనున్నారు. దేశంలో అత్యంత సుదీర్ఘకాలం పాటు నిరంతరాయంగా పాలించిన ప్రధానిగా జూన్ 10న



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

# కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం.. హాజరైన రాహుల్, ఖర్గే

కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్‌లోని గ్లాస్ హౌస్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఆయనతో ప్రమాణం చేయించారు. డీకే శివకుమార్ రాజ్యాంగం చేతపట్టుకుని ప్రమాణం చేశారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, మల్లు భట్టివిక్రమార్క తదితరులు హాజరయ్యారు.డీకే శివకుమార్ కేబినెట్‌లో మాజీ సీఎం సిద్ధరామయ్య తనయుడు యతీంద్రకు చోటు దక్కింది. పరమేశ్వర ఏకైక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కర్ణాటక కొత్త మంత్రివర్గంలో 12 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ తనకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారని డీకే శివకుమార్ వెల్లడించారు. పార్టీలో అందరినీ కలుపుకుని ముందుకు సాగాలని ఆమె సూచించినట్లు తెలిపారు. తన నాయకత్వంపై సోనియా గాంధీ పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారని ఆయన పేర్కొన్నారు.ప్రమాణ స్వీకారానికి ముందు డీకే శివకుమార్ విలేకరులతో మాట్లాడుతూ, "సోనియా గాంధీ నాతో ఫోన్‌లో మాట్లాడారు. మొదటి నుంచి నాపై ఆమెకు చాలా నమ్మకం ఉంది. నన్ను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించింది సోనియానే. అందరినీ కలుపుకుని పనిచేయాలని ఆమె సూచించారు. ఆమె నమ్మకాన్ని నిలబెడతానని, అందరినీ కలుపుకుని ముందుకు వెళతానని నేను హామీ ఇచ్చాను" అని వివరించారు.

# తెలంగాణ నాలుగు కోట్ల మంది జాగీర్: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

సభ పెడతానంటే ఎలా? అని ప్రశ్నించారు. "తెలంగాణ మీ అయ్య జాగీరా?" అంటూ మంగళవారం పవన్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రాంతీయవాదం.. ఉగ్రవాదం కంటే ప్రమాదం అన్న పవన్ వ్యాఖ్యలను కేటీఆర్ తప్పుబట్టారు. మద్రాస్ నుంచి వేర్పాటు కోసం ఆత్మబలిదానం చేసిన పొట్టి శ్రీరాములుది కూడా ప్రాంతీయవాదమేనా అని ప్రశ్నించారు. తెలంగాణకు వస్తున్న అనేక పరిశ్రమలను ప్రధాని మోదీ తన స్వరాష్ట్రం గుజరాత్‌కు తరలించుకుపోతున్నారని కేటీఆర్ ఈ సందర్భంగా ఆరోపించారు. "జాతీయవాదం ముసుగులో మోదీ చేస్తున్న ఆర్థిక ప్రాంతీయవాదాన్ని ఏమంటారు?" అని ప్రశ్నించారు.దేశంలో ఎవరైనా ఎక్కడైనా పార్టీ పెట్టుకోవచ్చని కేటీఆర్ అన్నారు. అలాగే ఎక్కడైనా పోటీ చేసే హక్కు ఉందని తెలిపారు. జనసేన కొత్తగా పోటీ చేసేదేముందని.. 2018, 2023లో జనసేన తెలంగాణలో పోటీ చేయలేదా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడినప్పుడు 11 రోజులు అన్నం తినలేదన్న పవన్ వ్యాఖ్యలను ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. అదే వ్యక్తి మళ్లీ తెలంగాణకు వ్యతిరేకం కాదంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణకు 'ఓజీ' కేసీఆర్ అని.. ఇంకెవ్వరూ అవసరం లేదన్నారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌ను గౌరవిస్తామని కేటీఆర్ అన్నారు. సోదరుడిగా ఇంటికొస్తే బిర్యానీ పెడతామని వ్యాఖ్యానించారు. సినీ నటుడిగా, కళాకారుడిగా అభిమానిస్తాం. కానీ, సెక్రటేరియట్‌లోకి వచ్చి పెత్తనం చేస్తామంటే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# సీఎం రేవంత్‌తో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ భేటీ

తెలంగాణ, దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా కీలక అడుగుపడింది. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ షిపోకోసా పౌలస్ మషాటిలే బృందం సమావేశమైంది. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఈ భేటీలో ఇరుపక్షాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య అవకాశాలపై ప్రధానంగా చర్చించారు.సమాచార సాంకేతికత (ఐటీ), ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం వంటి కీలక రంగాల్లో పరస్పర సహకారంపై చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే దక్షిణాఫ్రికా కంపెనీలకు, పారిశ్రామికవేత్తలకు పూర్తి మద్దతు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) హైదరాబాద్ కేంద్రంగా మారిందని, ప్రపంచస్థాయి వైద్య సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు దక్షిణాఫ్రికా ప్రతినిధి బృందాన్ని సీఎం ఆహ్వానించారు. ఈ సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనరసింహ కూడా పాల్గొన్నారు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య చారిత్రక బంధం ఉందని డిప్యూటీ ప్రెసిడెంట్ మషాటిలే గుర్తుచేశారు. ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా ద్వారా తెలంగాణ కంపెనీలకు విస్తృత మార్కెట్ అవకాశాలు లభిస్తాయని, ముఖ్యంగా ఫార్మా రంగంలో స్థానికంగా ఉత్పత్తి భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు.



# ఆరోగ్యమే అసలైన సంపద.. జీవనశైలి మార్చుకోవాలి: సీఎం చంద్రబాబు

రాజధాని అమరావతిని భవిష్యత్తులో ప్రపంచస్థాయి ఆరోగ్య కేంద్రంగా (గ్లోబల్ హెల్త్ హబ్) తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. గతంలో హైదరాబాద్‌లో హెల్త్ టూరిజాన్ని ప్రోత్సహించిన విధంగానే రాబోయే రోజుల్లో ప్రపంచ నలుమూలల నుంచి రోగులు అమరావతికి వచ్చి చికిత్స పొందే పరిస్థితిని కల్పిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గుంటూరులో నూతనంగా ఏర్పాటు చేసిన లలితా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న అనంతరం ఆయన ప్రసంగించారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. గుంటూరులో 600 పడకలతో, 32 విభాగాలతో అత్యాధునిక వసతులతో లలితా ఆసుపత్రిని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా, దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా ఆధునిక ఎమ్ఆర్ఐ స్కాన్‌ను ఇక్కడ ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. "ఒక బ్రాండ్‌కు విలువలు, ప్రజల్లో విశ్వసనీయత తోడైతే దానికి తిరుగుండదు. దశాబ్దాలుగా వైద్య రంగంలో ఉన్న లలితా గ్రూప్ అందుకు నిదర్శనం" అని చంద్రబాబు పేర్కొన్నారు.

ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు

రాష్ట్రంలో ఆరోగ్య రంగాన్ని సమూలంగా మారుస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు 'సంజీవని' ప్రాజెక్టును తీసుకొచ్చాం. దీని ద్వారా ప్రతి ఒక్కరి డిజిటల్ హెల్త్ రికార్డులు నిర్వహిస్తాం. వ్యాధి రాకముందే గుర్తించడం (ప్రిడిక్టివ్), రాకుండా నివారించడం (ప్రివెంటివ్), వచ్చాక నయం చేయడం (క్యూరేటివ్) అనే త్రిముఖ వ్యూహంతో పనిచేస్తాం. ఇంటి వద్దకే వచ్చి 42 రకాల వైద్య పరీక్షలు చేస్తాం" అని వివరించారు. రాష్ట్రంలో 'యూనివర్సల్ హెల్త్ పాలసీ'ని అమలు చేసి, ప్రతి కుటుంబానికి రూ.2.5 లక్షల వరకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్యమే అసలైన సంపద అని, ఆరోగ్యకరమైన పౌరులే సంపన్న దేశాన్ని నిర్మిస్తారని చంద్రబాబు అన్నారు. మంచి ఆహారం, వ్యాయామం, యోగా, ప్రాణాయామం వంటివి జీవనశైలిలో భాగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. "మన వంటిల్లే మన ఫార్మసీ. మనం తినే ఆహారమే మనకు రక్ష. కానీ ఈ రోజుల్లో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారకాల వాడకం పెరిగిపోయింది," అని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నాసిరకం మద్యం విక్రయించి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడారని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని ఆసుపత్రులు కట్టినా, ప్రజల జీవనశైలిలో మార్పు రానంత వరకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం కాదని హితవు పలికారు.

# నెహ్రూ రికార్డు బద్దలు.. సుదీర్ఘకాలం పాలించిన ప్రధానిగా మోదీ సరికొత్త చరిత్ర!

(మొదటి పేజీ తరువాయి)

ఆయన సరికొత్త రికార్డు సృష్టించనున్నారు. స్వతంత్ర భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న దశాబ్దాల నాటి రికార్డును మోదీ అధిగమించనున్నారు. 2014 మే 26న తొలిసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన మోదీ.. జూన్ 10 నాటికి వరుసగా 4,399 రోజుల పాలనను పూర్తి చేసుకోనున్నారు.దేశంలో మొదటి సాధారణ ఎన్నికల తర్వాత 1952 మే 13న నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన 1964 మే 27న మరణించే వరకు వరుసగా 4,398 రోజుల పాటు ఆ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆ రికార్డును మోదీ దాటనున్నారు. అంతకుముందు 2025 జులై 25న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేరిట ఉన్న 4,077 రోజుల నిరంతరాయ పాలన రికార్డును మోదీ దాటేశారు.నెహ్రూ కాలంతో పోలిస్తే ప్రస్తుతం దేశ జనాభా, ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. తొలి సాధారణ ఎన్నికల సమయంలో దేశ జనాభా 34 కోట్లుగా ఉండగా ఓటర్లు 17 కోట్లు మాత్రమే. మోదీ ప్రధాని అయ్యే నాటికి జనాభా 131 కోట్లకు చేరి ప్రస్తుతం 146 కోట్లు దాటింది. అలాగే 1952 ఎన్నికల్లో కేవలం 53 పార్టీలు పోటీ చేయగా.. 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి పోటీ చేసిన పార్టీల సంఖ్య ఏకంగా 744కు చేరింది.నెహ్రూ తర్వాత వరుసగా మూడుసార్లు లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన ఏకైక ప్రధానిగా మోదీ నిలిచారు. కాంగ్రెసేతర ప్రధానిగా వరుసగా రెండుసార్లు పూర్తి మెజారిటీ సాధించిన రికార్డు కూడా ఆయనదే. గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా కలిపి అత్యధిక కాలం (8,930 రోజులకు పైగా) అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధిగా ఇప్పటికే మోదీ రికార్డు సృష్టించారు.



# తెలంగాణకు వర్ష సూచన.. 18 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

**ఈరోజు, రేపు తెలంగాణలోని పలు జిల్లాలకు వర్ష సూచన**

**18 జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం**

**రేపటి లోగా కేరళ, తమిళనాడును తాకనున్న నైరుతి రుతుపవనాలు**

తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఈరోజు, రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు.ఈ భారీ వర్షాలతో పాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులు సంభవించే ప్రమాదం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు, దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రేపటిలోగా కేరళ, తమిళనాడు తీరాలను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి నుంచే



పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రాత్రంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. రాబోయే రెండు రోజులు మరిన్ని భారీ వర్షాల సూచన ఉన్నందున, ముఖ్యంగా రైతులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# జూన్ 10లోపు పాఠశాలల మరమ్మతు పనులు పూర్తి చేయాలి





**జిల్లా కలెక్టర్. బి చంద్రశేఖర్**

**నల్గొండ జిల్లా జూన్ 3 నేటి వెలుగు ప్రతినిధి**

విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అన్ని మరమ్మతు పనులను జూన్ 10లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓలు), ఆర్‌సీఓలు, సంక్షేమ శాఖ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బడిబాట కార్యక్రమం ఏర్పాట్లు, చీ=+జూ నిధుల వినియోగం, పాఠశాల భవనాల మరమ్మతులు, పాఠశాల బస్సుల ఫిట్‌నెస్, అంగన్‌వాడీ కేంద్రాల సౌకర్యాలు, కేజీబీవీలలో పెండింగ్ పనులు, విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ, సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులు, పీఎం శ్రీ పాఠశాలల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫర్నిచర్ తదితర మౌలిక వసతులు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలను పూర్తిచేసి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో లైబ్రరీలను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలని, జీరో అడ్మిషన్లు ఉన్న పాఠశాలల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి నమోదు సంఖ్య పెంచాలని అధికారులకు సూచించారు. జూన్ 12లోపు విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు అందించాలని ఆదేశించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులకు ఏఐ (ూ×) ఆధారిత తరగతులు నిర్వహించాలని, పాఠశాలలలోనే ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీకి చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి విద్యార్థి తెలుగు, హిందీ, ఇంగ్లీష్ మూడు భాషల్లో ప్రావీణ్యం సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు.తెలంగాణ పబ్లిక్ మోడల్ స్కూల్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి దశరథ. స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ వై అశోక్ రెడ్డి. జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర రావు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి పిడి శేఖర్ రెడ్డి. సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

# ప్రభుత్వ భూముల కబ్జాలపై కఠిన చర్యలు జిల్లా కలెక్టర్. బి చంద్రశేఖర్





**నల్గొండ జిల్లా జూన్ 3 నేటి వెలుగు ప్రతినిధి**

ప్రభుత్వ భూములు, చెరువుల శిఖం భూములను ఎవరైనా అక్రమంగా కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్. బి చంద్రశేఖర్ హెచ్చరించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్‌డీఓలు, తహసీల్దారులతో సాదా బైనామా, భూభారతి, ల్యాండ్ సర్వే అంశాలపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రైతులకు త్వరగా న్యాయం చేయాలని అన్నారు. సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారంలో ఎవరైనా డబ్బులు తీసుకుని పనులు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.జిల్లాలో ప్రభుత్వ భూములు, చెరువుల శిఖం భూములు, ఇతర ప్రజా ప్రయోజన భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. అలాగే భూభారతి సంబంధిత కేసులను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా అటవీ, రెవెన్యూ, దేవాదాయ శాఖలకు చెందిన భూముల సర్వేను వేగవంతం చేసి, భూ రికార్డులను సమగ్రంగా రూపొందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎస్ ఐ ఆర్ లో భాగంగా డోర్ టు డోర్ బిఎల్‌ఓ లతో పని చేయించుకోవాలని,గురువారం జరగబోయే గ్రామ సభలో అందరు పాల్గొని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్ నాయక్ ,ల్యాండ్ సర్వే ఏడి ధీరజ్, ఆర్‌డీఓలు, తహసీల్దారులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జనగణన--2027 సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట జూన్ 3 నేటి వెలుగు ప్రతినిధి**

జనగణన--2027 సర్వే దేశాభివృద్ధికి కీలకమైన ప్రక్రియ అని, ప్రజలందరూ ఎనిమరేటర్లకు సహకరించి తమ వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ పిలుపునిచ్చారు. ఇంటింటికి వచ్చే సర్వే సిబ్బందికి సరైన సమాచారం అందించి జనగణన విజయవంతం కావడానికి తోడ్పడాలని సూచించారు. జనగణన--2027 సర్వేలో భాగంగా బుధవారం అధికారులు కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లి జిల్లా కలెక్టర్ నమోదు చేసిన వివరాలను వెరైఫికేషన్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన ద్వారా సేకరించే గణాంకాలు ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల రూపకల్పనకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా సర్వేలో పాల్గొని ఖచ్చితమైన వివరాలు అందించాలని కోరారు.ఈ సందర్భంగా సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు



## పర్యావరణ పరిరక్షణ మరియు పర్యావరణహిత జీవన విధానాలపై అవగాహన కార్యక్రమం



**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా జూన్ 3 నేటి వెలుగు ప్రతినిధి**



ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో తేదీ:03 జూన్ 2026 న శిరీష యూబీఆర్ మహిళా డిగ్రీ కళాశాల, సమతా నగర్, కూకట్‌పల్లి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో విద్యార్థినుల కోసం పర్యావరణ పరిరక్షణ మరియు పర్యావరణహిత జీవన విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినుల మధ్య క్విజ్, చిత్రలేఖనం, వ్యాసరచన, పోస్టర్ తయారీ, నినాదాల రచన పోటీలు నిర్వహించబడ్డాయి. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ మరియు సుస్థిర అభివృద్ధి అంశాలపై విద్యార్థినుల్లో అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.

పోటీలు ముగిసిన అనంతరం శ బి. రాజేందర్, పర్యావరణ ఇంజనీర్ మరియు నోడల్ అధికారి, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి విజేతలకు బహుమతులు మరియు ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రతి విభాగంలో ప్రథమ మరియు ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థినులను అభినందించారు.ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల అధ్యాపక బృందం, బి. రాజేందర్ మరియు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తుచేస్తూ, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన మరియు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు కృషి చేయాలని విద్యార్థినులకు సూచించారు.

# కార్పొరేషన్ లో కొనసాగుతున్న ఇందిరమ్మ చీరల పంపిణీ

**ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి**

**పాల్గొన్న స్థానిక కార్పొరేటర్లు**

**నల్లగొండ పట్టణం జూన్ 3 నేటి వెలుగు ప్రతినిధి**

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది. బుధవారం కార్పొరేషన్ లోని పలు డివిజన్లో మహిళా శక్తి పథకం కింద మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్పొరేషన్ లోని 6,7,8,9,20,18,19,39,42వ డివిజన్ లోని నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక కార్పొరేటర్లతో కలిసి మహిళలకు ఇందిరమ్మ చీరలను అందజేశారుఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని అన్నారు. అందులో భాగంగానే మహిళా శక్తి పథకం కింద అర్హులైన మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తుందని తెలిపారు.నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లోని అన్ని డివిజన్లో అర్హులైన ప్రతి ఒక్కరికి చీరలను అందిస్తామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, 18 డివిజన్ కార్పొరేటర్ ఆలకుంట్ల ఝాన్సీ రాణి నాగరత్నం రాజు, 8వ డివిజన్ కార్పొరేటర్ వజ్జా సంతోషిని రమేష్ యాదవ్, 20 డివిజన్ కార్పొరేటర్ అల్లి సుభాష్ చంద్రబోస్ యాదవ్,19 వ డివిజన్ కార్పొరేటర్ గోగుల గణేష్,42 వ డివిజన్ కార్పొరేటర్ అల్లి నాగలక్ష్మి మల్లికార్జున్, 9 వ డివిజన్ కార్పొరేటర్ బాణావత్ దీప్లా, 6 డివిజన్ కార్పొరేటర్ కుందూరు దీపిక,7 వ డివిజన్ కార్పొరేటర్ మారగొని భవాని గణేష్ ,39వ డివిజన్ కార్పొరేటర్ దాసరి సాయికుమార్, నల్లగొండ పిఏసిఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు, మాజీ కౌన్సిలర్లు కరుణాకర్ రెడ్డి, ప్రదీప్ నాయక్, కాంగ్రెస్ నాయకులు వజ్జ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

## తుమ్మిడి హట్టి ప్రాజెక్టును వ్యతిరేకించే నైతిక హక్కు బండి సంజయ్‌కు లేదు: వేముల వీరేశం

**హైదరాబాద్ జూన్ 3 నేటి వెలుగు ప్రతినిధి**



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి . రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించినట్లు ప్రభుత్వ విప్ ఌ నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ కేంద్ర మంత్రి శ్రీ బండి సంజయ్ అసంబద్ధ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు.తుమ్మిడి హట్టి ప్రాజెక్టు రాష్ట్రానికి అవసరంఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు, తాగునీరు అందించే దిశగా తుమ్మిడి హట్టి ప్రాజెక్టు కీలకమని వేముల వీరేశంగారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రజల ఓట్లు మాత్రమే కాదు, రాష్ట్ర అభివృద్ధి కోసం జాతీయ ప్రాజెక్టులను కూడా తీసుకురావాల్సిన బాధ్యత ఈ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులపై ఉందని గుర్తు చేశారు. తుమ్మిడి హట్టి ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న బండి సంజయ్‌కు మా ప్రభుత్వంపై మాట్లాడే నైతిక హక్కు లేదని ఎద్దేవా చేశారు.

బీజేపీ–బీఆర్ఎస్ కుట్ర

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్నాయని ఆరోపించారు. గత 10 సంవత్సరాల్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయని, వాటిపై విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పగించినప్పటికీ కేంద్రం ఇప్పటివరకు తేల్చలేదని తెలిపారు.తెలంగాణ ఏర్పాటు పట్ల బీజేపీకి మొదటి నుండి వ్యతిరేక ధోరణి ఉందని, నాడు తెలంగాణ ప్రాంతంలో ఇకపై ఒక్క బిడ్డ కూడా బలిదానం కాకూడదనే ఆలోచనతో శ్రీమతి సోనియా గాంధీ గారు రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తు చేశారు.

కెసిఆర్, పవన్ కళ్యాణ్‌పై విమర్శలు

కెసిఆర్ తెలంగాణపై నిజమైన ప్రేమ ఉంటే జూన్ 2న అమరవీరులకు నివాళు లర్పించేవారని, ఆయన ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు 3 ఎకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, దళిత ముఖ్యమంత్రి అంటూ ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చలేదని విమర్శించారు.ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణ రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం వెనుక బీజేపీ--బీఆర్ఎస్ రాజకీయ ఆట ఉందని ప్రజలు భావిస్తున్నారని అన్నారు.

రాహుల్ గాంధీ ని ప్రధానమంత్రి చేసే లక్ష్యం

దేశ రాజకీయాల్లో మార్పు తీసుకువచ్చి రాహుల్ గాంధీ ని ప్రధానమంత్రిగా చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని, ఈ లక్ష్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దమ్ము, ధైర్యము కూడా రాహుల్ గాంధీ కి వెన్నుదున్నగా ఉంటుందని వేముల వీరేశం స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రయోజనాల కోసం జాతీయ ప్రాజెక్టులు తీసుకురావాలి తప్ప తెలంగాణకు శాపంలా మారకూడదని బండి సంజయ్‌కు హితవు పలికారు.

## ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీ నియంత్రణకు ఉద్యమిద్దాం

**బిసి యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్**


**మిర్యాలగూడ పట్టణం జూన్ 3 నేటి వెలుగు ప్రతినిధి**

మిర్యాలగూడ పట్టణంలో విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు ఫీజుల దోపిడీకి సిద్ధమైన సందర్భంలో వారి దోపిడీకి అడ్డు కట్ట వేయాల్సినటువంటి ప్రభుత్వం పట్టించు కో పోవడానికి నిరసిస్తూ మిర్యాలగూడలో బీసీ యువజన ,విద్యార్థి సంఘం సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ మిర్యాలగూడలో విచ్చలవిడిగా విద్యా వ్యాపారం కొనసాగుతున్నప్పటికీ కూడా నేటికీ విద్యాశాఖ అధికారులు కానీ ప్రభుత్వం కానీ ఫీజుల కట్టడి ఎందుకు చేయడం లేదు పేద విద్యార్థుల తల్లిదండ్రుల నుండి లక్షల రూపాయలు వసూళ్లు చేస్తున్న కూడా విద్యాశాఖ అధికారులకు కండ్లు కనపడడం లేదా అని ఆయన హెచ్చరించారు విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాలలు ఏర్పాటు చేసుకొని వారు ఇష్టానుసారంగా ఫీజులు నిర్ణయించుకొని విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి పెద్ద మొత్తంలో డబ్బులు వసూళు చేస్తున్నారు .విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల్ని చదివించుకోవడానికి భూములు బంగారం అమ్ముకునే పరిస్థితి మన మిర్యాలగూడ కు కూడా వచ్చింది ఇలాంటి విద్య వ్యాపారాన్ని అరికట్ట వలసినటువంటి ప్రభుత్వం చోద్యం చూస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక క్షోభకు గురికావడమే కాక అత్యధిక వడ్డీలకు తెచ్చి పాఠశాలలలో చెల్లిస్తున్న సందర్భం ఉంది విద్యని వ్యాపారంగా చేసుకుని వ్యాపార సామ్రాజ్యం మాఫియాగా నడుస్తున్నటువంటి విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోకపోతే మాత్రం బీసీ సంఘం పెద్ద ఎత్తున ఉద్యమం చేయడానికి సిద్ధమైందని ఆయన అన్నారు పాఠశాలలో అత్యధిక ఫీజు వసూళ్లు, మరియు పుస్తకాలు, యూనిఫాం ల పేరిట దోపిడీకి సిద్ధమైన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోకపోతే మాత్రం ప్రజా ప్రతినిధులు మరియు విద్యాశాఖ అధికారుల కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు .. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్క నాగేశ్వరరావు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా నా య ం క ం ల ం కొత్రపిడిత సురేష్, పట్టేటి రమేష్, శంకర్, ఉపేందర్, గంగాధర్, రాంబాబు, మనీ తదితరులు పాల్గొన్నారు



# ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలి






**ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట జూన్ 3 నేటి వెలుగు ప్రతినిధి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. జూన్ 4, 6, 8, 10 తేదీలలో నిర్వహించనున్న గ్రామ, వార్డు సభల ఏర్పాట్లపై బుధవారం జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో వేబెక్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వీటిని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో వర్షాకాల ముందస్తు చర్యలు, శానిటేషన్, త్రాగునీరు, ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) తదితర అంశాలపై అధికారులతో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో తప్పనిసరిగా గ్రామ సభలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సభలకు మండల స్థాయి అధికారులు అందరూ విధిగా హాజరుకావాలని, ఇందుకు సంబంధించిన సిబ్బంది వివరాలను తక్షణమే సమర్పించాలని ఆదేశించారు. ఎండాకాలం తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, గ్రామ సభలను ఉదయమే నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సభలు జరిగే చోట తాగునీరు వంటి అన్ని కనీస మౌలిక వసతులు కల్పించాలని, షెడ్యూల్ వివరాలను గ్రామాల్లో ముందే చాటింపు వేయించి ప్రజలకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన

ఈ వర్షాకాలంలో జిల్లాలో సాధారణం కంటే కొంత తక్కువ వర్షపాతం నమోదయ్యే ఆస్కారం ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం ఎక్కువగా పండుతుందని, అయితే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతులను క్రాప్ డైవర్షన్ వైపు ప్రోత్సహించాలన్నారు. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు గ్రామ సభల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

ఓటరు జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై క్షేత్రస్థాయిలో ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు బీఎల్ఓలు ప్రతి ఇంటికీ తిరిగి ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలిస్తారని తెలిపారు.

జూలై 31న ఓటరు ముసాయిదా (డ్రాఫ్ట్) జాబితా ప్రచురణ జరుగుతుందని, అనంతరం అభ్యంతరాల స్వీకరణ, నోటీసుల జారీ ఉంటుందని వివరించారు.

అక్టోబర్ 1వ తేదీన ఓటర్ల తుది జాబితాను (ఫైనల్ పబ్లికేషన్) విడుదల చేస్తారని పేర్కొన్నారు. 2002 నాటి జాబితా ప్రకారం కొత్త ఇంటెన్సివ్ జాబితాను తయారు చేయడం జరుగుతుందన్నారు. జాబితాలో ఉన్న ప్రతి ఓటరు వివరాలను ఎలిమినేషన్ ఫామ్‌లో నమోదు చేసి, నిర్ధారించుకుని బీఎల్ఓలకు అందించాలన్నారు. 2002 ఓటరు జాబితాలో పేరు లేని వారు తమ తల్లిదండ్రుల వివరాలను ఫామ్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని, ఒకవేళ తల్లిదండ్రుల పేరు కూడా లేకపోతే ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

వర్షాకాల ముందస్తు చర్యలు చేపట్టాలి

వర్షాకాలం ముంచుకొస్తున్న నేపథ్యంలో గ్రామస్థాయిలో వరదలకు గురయ్యే లోతట్టు ప్రాంతాలను ముందే గుర్తించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున గ్రామాల్లో శానిటేషన్ పనులు ముమ్మరం చేయాలని, ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయాలన్నారు. తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని, మ్యాజిక్ సోక్ పిట్స్, జల సంరక్షణ, వన సంరక్షణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

బడి బాటపై ప్రత్యేక చర్చ నిర్వహించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు చేపట్టిన 'బడి బాట' కార్యక్రమంపై గ్రామ సభల్లో ప్రత్యేకంగా చర్చించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాల్లోని పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేలా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు చొరవ చూపి తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరి సింగ్, జడ్పీ సీఈఓ శిరీష, డిఆర్డిఓ సన్యాసయ్య, డిపిఓ యాదగిరి, ఇఇ మిషన్ భగీరథ అరుణాకర్ రెడ్డి, డిఇఓ అశోక్, డిఐఇఓ సులోచన, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక వార్డు సభలను విజయవంతం చేయాలి

**నాలుగు విడతల్లో 48 డివిజన్లలో వార్డు సభలు : మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర**

**నల్గొండ జూన్ 3 నేటి వెలుగు ప్రతినిధి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న లి"ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక"లి కార్యక్రమంలో భాగంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహించనున్న ప్రత్యేక వార్డు సభలపై మున్సిపల్ కమిషనర్ లిబి. శరత్ చంద్రలి నేడు నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో సెక్షన్ హెడ్‌లు, వార్డు అధికారులు, పర్యవేక్షణ అధికారులు మరియు శానిటరీ జవాన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు లి04.06.2026న 12 డివిజన్లు, 06.06.2026న 12 డివిజన్లు, 08.06.2026న 12 డివిజన్లు మరియు 10.06.2026న 12 డివిజన్లలోలి ప్రత్యేక వార్డు సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి వార్డు అధికారి తనకు కేటాయించిన డివిజన్‌లో ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాలు, అమృత్ మిత్ర గ్రూపులు, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో వార్డు సభలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.వార్డు సభల ద్వారా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్--2026లిలి, నాలుగు రకాల చెత్త వేరు చేయడం, ఈ-వేస్ట్ నిర్వహణ, వర్షాకాల సన్నద్ధత, డ్రైనేజీల శు భ్రత, తాగునీటి సరఫరా, నీటి నిల్వల నివారణ, వీధి దీపాల నిర్వహణ, మొక్కల పెంపకం, వర్షపు నీటి సంరక్షణ, ప్రజారోగ్య పరిరక్షణ తదితర అంశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ చెత్త మరియు ప్రత్యేక సంరక్షణ చెత్తను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించాలని తెలిపారు. అలాగే రాబోయే వర్షాకాలంలో సంభవించే సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రజలను ముందస్తుగా చైతన్యపరచాలని అధికారులను ఆదేశించారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడమే వార్డు సభల ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొంటూ, నగర ప్రజలందరూ తమ తమ డివిజన్లలో నిర్వహించే వార్డు సభలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో లిలిసహాయ నగర ప్రణాళికాధికారి జె. కృష్ణవేణి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. అశోక్ కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్లు ఎం. ఆసిమ్ బాబా, టి. ప్రవీణ్, కార్యాలయ సిబ్బంది, వార్డు అధికారులు, పర్యవేక్షణ అధికారులు మరియు శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.







Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**